GV MALL shop & celebrate TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్క్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 112 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం 26 నవంబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# రాజ్యాంగ దినోత్సవం .. మోదీ, అమిత్ షా శుభాకాంక్షలు

**రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా ప్రధాని మోదీ, అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు.**




దిల్లీ, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నేడు (మంగళవారం) పాత పార్లమెంటు ప్రాంగణంలోని సెంట్రల్ హాల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

పటిష్ఠ భారత్ నిర్మాణానికి కృషి చేస్తామని దేశ ప్రజలంతా ప్రతిజ్ఞ చేయాలని వారు పిలుపునిచ్చారు.భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాలకు రాజ్యంగమే బలమని అమిత్ షా పేర్కొన్నారు. ప్రతి వ్యక్తికి సమాన హక్కులు కల్పిస్తూ జాతీయ ఐక్యత, సమగ్రతకు పెద్దపీట వేస్తోందన్నారు. దేశ అభివృద్ధిలో రాజ్యాంగ నిర్మాతల సహకారాన్ని స్మరించుకుంటూ ఈ వేడుకలను జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాజ్యాంగం అంటే కేవలం వేదికలపై ప్రదర్శించే పుస్తకం కాదని.. అందులోని విషయాలను పూర్తి భక్తితో పాటించడం అత్యంత కీలకమని షా పేర్కొన్నారు.75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతితో పాటు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ఖడ్, లోక్సభ స్పీకర్ ఓం బిర్లా ప్రసంగిస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాట్లాడే అవకాశమివ్వాలంటూ ఇండియా కూటమి పార్టీల నేతలు లోక్సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. దీనిపై కిరణ్ రిజిజు స్పందిస్తూ.. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్సభ స్పీకర్ మాత్రమే ప్రసంగిస్తారని.. ప్రధాని మోదీ కూడా ఇందులో ప్రసంగించరని వెల్లడించారు. వేడుకల అనంతరం జరిగే మరో కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

## సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ అందాలనేది రాజ్యాంగ లక్ష్యం: చంద్రబాబు

**భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్దదని.. ఇవాళ పవిత్ర, విశిష్టమైన రోజని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు**



అమరావతి, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్దదని.. ఇవాళ పవిత్ర, విశిష్టమైన రోజని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజ్యాంగ వజోత్సవాల సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు."భవిష్యత్లో ఎదురయ్యే సవాళ్లను ఊహించి రాజ్యాంగం రచించారు. రాజ్యాంగ పరిషత్లో తెలుగు వాళ్లు ప్రధాన పాత్ర పోషించారు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ అందాలనేది రాజ్యాంగ లక్ష్యం. ఓటు హక్కు ద్వారా రాజ్యాంగాన్ని కాపాడుకోగలుగుతున్నాం. దీనిని దుర్వినియోగం చేసిన నేతలకు ఓటు ద్వారా ప్రజలు బుద్ధి చెబుతున్నారు. ప్రాథమిక హక్కులను కూడా గతంలో ఎలా కాలరాశారో చూశాం. అధికార దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ఉల్లంఘనే. రాజ్యాంగం ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసం ఉపయోగించాలి" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## జనవరి 10 నుంచి 19 వరకు.. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం

**వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు పది రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్లు తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు.**



తిరుమల, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు పది రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్లు తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ఈ సమయంలో వీఐపీ ప్రొటోకాల్ దర్శనాలు మినహా చంటిపిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆర్మీ, ఎన్ఆరల దర్శనాలు, ఇతర ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక అన్నమయ్య భవనంలో తితిదే వివిధ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం సమావేశమైన ఆయన వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్షించారు.

## కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్ తో పవన్ భేటీ



ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో ఉన్నారు.

దిల్లీ, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ను ఆయన కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పర్యాటకానికి సంబంధించి కొన్ని అంశాలు ప్రస్తావించినట్లు పవన్ పేర్కొన్నారు. టూరిజం ప్రాజెక్టులు, పర్యాటక వర్సిటీ వంటి 7 అంశాలపై మాట్లాడినట్లు చెప్పారు. వీటికి గజేంద్ర షెకావత్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో పవన్ సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పులను తాము సరిదిద్దుతున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ రక్షిత మంచినీరు ఇవ్వాలనేది ప్రధాని లక్ష్యమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో నీటి సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు.

## ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడటంలో రాజ్యాంగానిదే కీలక పాత్ర: మంత్రి లోకేశ్

**రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.**



అమరావతి , నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం ఉన్న మనదేశంలో.. భిన్నత్వంలో ఏకత్వం, ప్రజల హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడటంలో భారత రాజ్యాంగానిదే కీలక పాత్రని కొనియాడారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంలో రాజ్యాంగ నిర్మాతలైన అంబేద్కర్, న్యాయ కోవిదులు, రాజ్యాంగ నిపుణులు, స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకోవడం మన కర్తవ్యమని లోకేశ్ పిలుపునిచ్చారు.

## జగన్ కు అదానీ ముడుపుల వ్యవహారం.. ఏసీబీకి ఫిర్యాదు

**వైకాపా హయాంలో అప్పటి సీఎం జగన్కు అదానీ సంస్థ లంచం ఇచ్చిన వ్యవహారంపై ఏసీబీకి ఫిర్యాదు అందింది.**



అమరావతి , నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): వైకాపా హయాంలో అప్పటి సీఎం జగన్కు అదానీ సంస్థ లంచం ఇచ్చిన వ్యవహారంపై ఏసీబీకి ఫిర్యాదు అందింది. సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ వ్యవస్థాపకుడు నల్లమోతు చక్రవర్తి ఫిర్యాదు చేశారు. జగన్కు అదానీ సంస్థ రూ.1,750కోట్ల లంచం ఇచ్చినట్లు అమెరికా ఏజెన్సీ విచారణలో తేలిందని అందులో ఆయన పేర్కొన్నారు. సెకితో అదానీ కంపెనీ ఒప్పందంపై విచారణ జరపాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మెట్రో విస్తరణపై సీఎం రేవంత్ తో చర్చించాం: ఎన్వీఎస్ రెడ్డి


**ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో హైదరాబాద్ మెట్రో రైలు విజయవంతంగా నడుస్తోందని హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు.**



హైదరాబాద్ ,నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో హైదరాబాద్ మెట్రో రైలు విజయవంతంగా నడుస్తోందని హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. మెట్రో రైలు ఏడేళ్లు పూర్తిచేసుకుందని.. ఇది నగర వాసులకే కాకుండా తెలంగాణకు గర్వకారణమని చెప్పారు."మెట్రో రైలు మొదటి దశ నిర్మాణం సమయంలో నా దిష్టి బొమ్మలు దహనం చేశారు. అలా చేసినవాళ్లే నేడు పూలదండలతో సత్కరిస్తున్నారు. ముంబయి, చెన్నైలో భారీగా ఖర్చు చేసి మెట్రో విస్తరిస్తున్నారు. దురదృష్టవశాత్తు మన నగరంలో విస్తరణ లేకపోవడం వల్ల మూడో స్థానంలో ఉన్నాం. విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించాం. మొత్తం మూడు కారిడార్లు విమానాశ్రయానికి కలిపేలా రెండో దశ ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రెండో దశలో ఆరు కారిడార్లతో 116.4 కి.మీ ప్లాన్ చేశాం. ప్రస్తుతం ఐదు కారిడార్లకు డీపీఆర్ లు సిద్ధం చేసి పంపించాం. మేడ్చల్ వైపు కారిడార్ కోసం డిమాండ్లు వస్తున్నాయి. మెట్రో రైలు కోసం కేంద్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలు పెట్టింది. రెండో దశ పూర్తయితే మరింత పురోగతి సాధిస్తాం" అని ఎన్వీఎస్ రెడ్డి అన్నారు.

## బంగ్లాదేశ్ లో చిన్మోయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి అరెస్టు.. స్పందించిన భారత్

**ఇస్కాన్ కు చెందిన చిన్మోయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి ను బంగ్లాదేశ్ లోని ఢాకా విమానాశ్రయంలో అరెస్టు చేయడంపై భారత్ స్పందించింది.**



నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): ఇస్కాన్ కు చెందిన చిన్మోయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి ను బంగ్లాదేశ్ లోని ఢాకా విమానాశ్రయంలో అరెస్టు చేయడంపై భారత్ స్పందించింది. ఆయన్ను అరెస్టు చేసి అరెస్టు, బెయిల్ నిరాకరించడంపై భారత విదేశాంగశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో బంగ్లాదేశ్లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మైనార్టీలపై దాడులు సరికాదని తెలిపింది. హిందువులు, మైనార్టీలందరికీ భద్రత కల్పించాలని బంగ్లాదేశ్ అధికారులను కోరినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్ధీర్ జైస్వాల్ తెలిపారు.కృష్ణదాస్ ప్రభు అరెస్టు విషయంలో జోక్యం చేసుకొని, ఆయన్ను విడిపించాలని ఇస్కాన్ ఆలయ అధికారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయం తెలిసిందే. 'ఇస్కాన్కు చెందిన కృష్ణదాస్ ను బంగ్లాదేశ్లోని ఢాకా పోలీసులు అరెస్టు చేశారనే వార్తలను మేము చూశాం. అక్కడి అధికారులు ఇస్కాన్పై తప్పుడు ఆరోపణలు చేశారు. దీనిపై భారత ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. బంగ్లాదేశ్ ప్రభుత్వంతో మాట్లాడి.. మాది శాంతి, ప్రేమగల భక్తి ఉద్యమం అని తెలపాలి. కృష్ణదాసు వెంటనే విడుదల చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని ఇస్కాన్ 'ఎక్స్'లో పేర్కొంది.బంగ్లాదేశ్ మీడియా కథనాల ప్రకారం.. ఇస్కాన్కు చెందిన చిన్మోయ్ కృష్ణదాస్ గత నెలలో అక్కడ జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ జెండాను ఉద్దేశించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో ఢాకా విమానాశ్రయంలో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు అరెస్టును వ్యతిరేకిస్తూ పలు సంఘాలు ఆందోళనకు దిగాయి.

## ఏపీ సహా 4 రాష్ట్రాల్లో రాజ్యసభ ఉపఎన్నికలకు షెడ్యూల్

**ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో రాజ్యసభ ఉపఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) షెడ్యూల్ విడుదల చేసింది.**



దిల్లీ, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో రాజ్యసభ ఉపఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) షెడ్యూల్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ లో మూడు, ఒడిశా బెంగాల్ హరియాణా రాష్ట్రాల్లో ఒక్కో స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. డిసెంబర్ 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల స్వీకరణకు డిసెంబర్ 10ని తుది గడువుగా ఈసీ నిర్ణయించింది. డిసెంబర్ 11న నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ వరకు ఉపసంహరణకు ఈసీ అవకాశం కల్పించింది. డిసెంబర్ 20న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్.. అదే రోజు 5 గంటల నుంచి లెక్కింపు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్లో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్. కృష్ణయ్యల రాజీనామాతో ఉప ఎన్నికల అనివార్యం అయింది.

## మేం రెడ్ సిగ్నల్ ఇస్తే.. మీరు రెడ్ కార్పెట్ వేస్తున్నారు: కేటీఆర్

**సీఎం రేవంత్ రెడ్డి లో నిస్పృహ, అసహనం కనిపిస్తున్నాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**




హైదరాబాద్ ,నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి లో నిస్పృహ, అసహనం కనిపిస్తున్నాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస హయాంలో అదానీ కి ఇచ్చిన పనులు అంటూ ఆయన ఓ తప్పుడు నివేదిక విడుదల చేశారని ఆరోపించారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సీఎం సోమవారం నిర్వహించిన ప్రెస్మీట్లో చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. "సీఎం అవగాహనా రాహిత్యంతో మాట్లాడితే ఎలా? అదానీ కలిసి కొన్ని ప్రతిపాదనలు ఇస్తే అప్పటి సీఎం కేసీఆర్ తిరస్కరించారు. అదానీకి.. మేము రెడ్ సిగ్నల్ వేస్తే.. మీరు రెడ్ కార్పెట్ వేస్తున్నారు" అని సీఎం రేవంతు ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# వర్రా రవీందర్రెడ్డి కేసు

## .. వైకాపా సోషల్ మీడియా కన్వీనర్లను విచారించిన పోలీసులు

వైకాపా సామాజిక మాధ్యమ కార్యకర్త వర్రా రవీందర్రెడ్డి కేసులో ఆ పార్టీకి చెందిన మరికొందరిని పోలీసుల విచారిస్తున్నారు.




కడప , నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): వైకాపా సామాజిక మాధ్యమ కార్యకర్త వర్రా రవీందర్రెడ్డి కేసులో ఆ పార్టీకి చెందిన మరికొందరిని పోలీసులు విచారిస్తున్నారు. కడప సైబర్ క్రైమ్ పోలీసుల ఎదుట వైకాపా సోషల్ మీడియా కన్వీనర్లు సునీతరెడ్డి, నిరంజన్రెడ్డి, ఆనంద్రెడ్డి హాజరయ్యారు. అధికార పార్టీ నేతలపై పెట్టిన అసభ్యకర పోస్టులను వైరల్ చేశారనే ఆరోపణలపై ఈ ముగ్గురినీ విచారించారు. సోమవారం జరిగిన విచారణకు అదే పార్టీకి చెందిన విష్ణువర్ధన్రెడ్డి, నరేంద్రరెడ్డి హాజరయ్యారు. ఈనెల 8న పులివెందుల పోలీస్ స్టేషన్లో వర్రా రవీందర్రెడ్డితో పాటు మరికొందరిపై కేసు నమోదైంది. ఇప్పటికే 15 మందికి పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఓల్డ్ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కర్నూలు నగర మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



కర్నూలు, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఓల్డ్ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కర్నూలు నగర మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా యువజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఓల్డ్ బస్ స్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి ఓల్డ్ కంట్రోల్ రూం వరకు నిర్వహించిన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్డీఓ భూపతి రావు, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, జాయింట్ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ రంగ లక్ష్మి దేవి, వివిధ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ విచారణలో ప్రమాణం చేసి

## .. అబద్ధం ఎలా చెబుతారు: కమిషన్ ఆగ్రహం

సుందిళ్ల బ్యారేజీలోని 2ఏ బ్లాకును డిజైన్ లేకుండానే నిర్మాణం ప్రారంభించినట్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజినీర్లు తెలిపారు.



హైదరాబాద్ , నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): సుందిళ్ల బ్యారేజీలోని 2ఏ బ్లాకును డిజైన్ లేకుండానే నిర్మాణం ప్రారంభించినట్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజినీర్లు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు మంగళవారం 16 మంది క్షేత్రస్థాయి ఇంజినీర్లు విచారణకు హాజరయ్యారు. గతంలో వారు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన డిజైన్లు, నాణ్యతకు సంబంధించిన అంశాలపై డీఈ, ఏఈఈలను జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు.రెండో బ్లాక్ను పరిగణనలోకి తీసుకొని సుందిళ్ల బ్యారేజీ 2ఏ బ్లాక్ నిర్మాణాన్ని డిజైన్ లేకుండానే ప్రారంభించినట్టు ఇంజినీర్లు తెలిపారు. అప్పటి చీఫ్ ఇంజినీర్ ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్టు పేర్కొన్నారు. డిజైన్లు లేకుండా పనులు ఎలా చేపడతారని జస్టిస్ పీసీ ఘోష్ ఆక్షేపించారు. కొందరు ఇంజినీర్ల సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషన్ చైర్మన్.. తప్పుదోవ పట్టించవద్దని స్పష్టం చేశారు. అఫిడవిట్లో ఒక సమాచారం, విచారణలో మరొక సమాచారం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ విచారణలో ప్రమాణం చేసి అబద్ధం ఎలా చెబుతారని మండిపడ్డారు. అలా చేస్తే చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పనులకు సంబంధించిన ప్లేస్మెంట్ రిజిస్టర్లు, వె-ుజర్మెంట్ బుక్స్ పై ఇంజనీర్ల సంతకాలు తీసుకొన్న కమిషన్ వాటిని స్వాధీనం చేసుకొంది. బుధవారం మరో 18 మంది ఇంజనీర్లను కమిషన్ విచారించనుంది.

# దిలావర్పూర్ వద్ద జాతీయరహదారిపై రాస్తారోకో

దిలావర్పూర్ నిర్మించే ఇథనాల్ పరిశ్రమలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.




దిలావర్పూర్, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): నిర్మల్ జిల్లా దిలావర్పూర్లో నిర్మించే ఇథనాల్ పరిశ్రమలను నిలిపివేయాలని డిమాండ్ చేశా-ారు. కుటుంబ సమేతంగా వందల సంఖ్యలో రహదారిపై బైఠాయించి స్థానికులు నిరసన తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేతలు కనిపించట్లేదని ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

# రాష్ట్రంలో 2029 నాటికి 5 లక్షల ఐటీ వర్క్ స్టేషన్లు

## : సీఎం చంద్రబాబు

అమరావతిలో డీప్ టెక్నాలజీ ఐకానిక్ భవనాన్ని నిర్మించనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు.




అమరావతి, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): అమరావతిలో డీప్ టెక్నాలజీ ఐకానిక్ భవనాన్ని నిర్మించనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. నూతన ఐటీ పాలసీలో ప్రతిపాదనలపై సమీక్ష సందర్భంగా సీఎం తెలిపారు. 2029 నాటికి 5 లక్షల ఐటీ వర్క్ స్టేషన్లు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. యువతలో నైపుణ్యం పెంచే కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. స్టార్టప్లకు రూ.25 లక్షల వరకు సీడ్ ఫండింగ్ చేస్తామని సీఎం వివరించారు.

# ఏపీకి భారీ వర్ష సూచన

## .. అన్ని పోర్టుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారింది. గంటలకు 12 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా పయనిస్తోంది.



విశాఖ, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారింది. గంటలకు 12 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా పయనిస్తోంది. ట్రింకోమలికి ఆగ్నేయంగా 310 కిలోమీటర్ల దూరంలో, చెన్నైకు 800 కిలోమీటర్ల దూరంలో తీవ్ర వాయుగుండం కేంద్రీకృతమై ఉ ందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఇది.. ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ బలపడి రేపటికి తుపానుగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. రెండ్రోజుల్లో శ్రీలంక తీరాన్ని తాకుతూ తమిళనాడు వైపు ప్రయాణించే అవకాశం ఉందన్నారు. ఈ ప్రభావంతో 5 రోజుల్లో రాయలసీమ, దక్షిణ కోస్తా, ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. రానున్న 24 గంటల్లో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో, రానున్న 48 గంటల్లో అన్నమయ్య, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో, ఈనెల 30 నుంచి ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 45 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పోర్టుల్లో అధికారులు ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

# తిరుమల శ్రీవారి హుండీలో చోరీ

తిరుమల శ్రీవారి హుండీలో నగదు చోరీ జరిగింది. ఈనెల 23న మధ్యాహ్నం 2 గంటలకు జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.



తిరుమల, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): తిరుమల శ్రీవారి హుండీలో నగదు చోరీ జరిగింది. ఈనెల 23న మధ్యాహ్నం 2 గంటలకు జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయంలోని స్టీల్ హుండీ నుంచి తమిళనాడుకు చెందిన వేణులింగం నగదు చోరీ చేసి పారిపోయాడు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా చోరీ జరిగినట్లు భద్రతా సిబ్బంది గుర్తించారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు నిందితుడిని పట్టుకున్నారు. దొంగిలించిన రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని తితిదే విజిలెన్స్ అధికారులు పోలీసులకు అప్పగించారు.

# కష్టాల్లో ఉన్నాం.. కనికరించండి

పెద్దపల్లి సమీకృత పాలనా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి చలి తీవ్రత పెరగడంతో బాధితులు తక్కువ సంఖ్యలో వచ్చారు.




పెద్దపల్లి , నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): పెద్దపల్లి సమీకృత పాలనా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి చలి తీవ్రత పెరగడంతో బాధితులు తక్కువ సంఖ్యలో వచ్చారు. బాధితుల నుంచి కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, వేణులు ఫిర్యాదులు తీసుకున్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన బాధితులు వారి సమస్యను మొరపెట్టుకున్నారు. కష్టాల్లో ఉన్నామని.. తమని ఆదుకొమ్మని వేడుకున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్లు ప్రతి ఒక్కరి సమస్య వింటూ ఫిర్యాదుదారులకు పరిష్కరిస్తామనే భరోసా కల్పించారు.

# రఘురామకు చిత్రహింసల కేసు

## .. ప్రకాశం ఎస్పీ ఎదుట విచారణకు హాజరైన విజయ్ పాల్

సీఐడీ విశ్రాంత అదనపు ఎస్పీ విజయ్పాల్ ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఎదుట విచారణకు హాజరయ్యారు.




ఒంగోలు, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): సీఐడీ విశ్రాంత అదనపు ఎస్పీ విజయ్పాల్ ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ప్రస్తుత ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును గతంలో వైకాపా హయాంలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో ఆయనను విచారిస్తున్నారు.ఈ కేసులో ఈనెల 13న పోలీసులు విజయ్ పాల్ను విచారించారు. తనకేమీ తెలియదు.. గుర్తులేదు అంటూ ఆయన అప్పట్లో విచారణాధికారుల ఎదుట చెప్పారు. మ-రోవైపు ఈ కేసులో తన ముందస్తు బెయిల్ పిటిషన్ను కొట్టేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సెప్టెంబర్ 24న ఇచ్చిన తీర్పుపై ఆయన దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టేసింది. ఈ క్రమంలో విజయ్పాల్ నేడు విచారణకు హాజరుకావడంతో ఉత్కంఠ నెలకొంది. ఆయన్ను అరెస్ట్ చేసే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది.

# ఏపీలో రాజ్యసభ ఉప ఎన్నికలు

## .. కూటమి ఖాతాలోకి 3 స్థానాలు?

ఆంధ్రప్రదేశ్లో రాజ్యసభ ఉప ఎన్నికల సందడి మొదలైంది. వైకాపా సభ్యులు బీద మస్తాన్రావు, మోపిదేవి వెంకటరమణ, ఆర్. కృష్ణయ్య రాజీనామాలతో ఖాళీ అయిన 3 స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీఐ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది.



నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): ఆంధ్రప్రదేశ్లో రాజ్యసభ ఉప ఎన్నికల సందడి మొదలైంది. వైకాపా సభ్యులు బీద మస్తాన్రావు, మోపిదేవి వెంకటరమణ, ఆర్. కృష్ణయ్య రాజీనామాలతో ఖాళీ అయిన 3 స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీలో మొత్తం 175 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 164 సీట్లలో ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. వైకాపాకు ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. ఒక్క రాజ్యసభ అభ్యర్థి విజయం సాధించాలన్నా కనీసం 25 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం వైకాపా సంఖ్యాబలం 11 మాత్రమే. దీంతో ఆ పార్టీ రాజ్యసభ బరిలో నిలిచేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం ఉప ఎన్నిక జరగనున్న 3 స్థానాలను కూటమి కైవసం చేసుకోవడం దాదాపు ఖాయమైంది. అయితే, ఈ 3 స్థానాలను తెదేపా తీసుకుంటుందా? భాగస్వామ్య పక్షాలైన భాజపా, జనసేనకు కూడా అవకాశం ఇస్తుందా? అనేదానిపై చర్చ జరుగుతోంది. రాజ్యసభలో మొత్తం 11 స్థానాలను కైవసం చేసుకున్న వైకాపా పతనం మొదలైంది. 2019లో ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక 2020, 2022, 2024 ఫిబ్రవరిల్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కలిపి మొత్తం 11 స్థానాలను దక్కించుకుంది. అయితే మొన్నటి సాధారణ ఎన్నికల్లో వైకాపాకు ఘోర పరాభవం పాలైంది. ఆ తర్వాత 100 రోజుల్లోనే జగన్ పార్టీ రాజ్యసభలో మూడు స్థానాలను కోల్పోయింది. ప్రస్తుతం రాజ్యసభలో తెదేపా సభ్యుడు ఒక్కరు కూడా లేరు. తాజా ఉప ఎన్నికల తర్వాత తెదేపా సభ్యులు రాజ్యసభలో అడుగు పెట్టనున్నారు.

# ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్.. ముగ్గురికి మెమో

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించిన వ్యవహారంలో ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.




జగిత్యాల, నవంబర్, 26 (రిపబ్లిక్ న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించిన వ్యవహారంలో ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆహార నియంత్రణ అధికారులు తనిఖీ చేసి నాణ్యత లోపించిందని నివేదిక సమర్పించిన నేపథ్యంలో కొడిమ్యాల మండలం చెప్యాల జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ వి. వెంకటరమణారావు, పెద్దాపూర్ గురుకుల పా-ఠశాల టీజీటీ హెచ్. కిషోర్ను సస్పెండ్ చేశారు. చెప్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. వెంకటస్వామి, ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఎం. ప్రవీణ్ కుమార్, పెద్దాపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మాధవీలతకు మెమో జారీ చేశారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



రిపబ్లిక్ సినిమా CINEMA

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1926 : భారతీయ శాస్త్రవేత్త, విద్యావేత్త యశ్ పాల్ జననం. (మ. 2017)
- 1949 : స్వతంత్ర భారత రాజ్యాంగం ఆమోదించబడింది. (చిత్రంలో భారతదేశ చిహ్నం)
- 1956 : తమిళనాడు రాష్ట్రం ఏర్పడింది.
- 1960 : భారత టెలిఫోన్లు ఎస్.టి.డి సౌకర్యాన్ని ప్రవేశపెట్టాయి.
- 1967 : వెస్ట్ ఇండీస్ కు చెందిన క్రికెట్ క్రీడాకారుడు రిడ్లీ జాకబ్స్ జననం.
- 1975 : తెలుగు సినిమా హాస్య నటుడు రేలంగి వెంకట్రామయ్య మరణం (జ.1910).
- 2006 : తెలుగు సినిమా నటి జి.వరలక్ష్మి మరణం (జ.1926).
- 2008 : 2008 ముంబై లో టెర్రరిస్ట్ దాడులు జరిగినవి.


విద్యావేత్త యశ్ పాల్


భారత టెలిఫోన్లు


రేలంగి వెంకట్రామయ్య


జి.వరలక్ష్మి


ముంబై లో

# ఆ ప్రయాణం అద్భుతం: దిల్లీ జట్టును వీడడంపై పంత్ ఎమోషనల్ పోస్టు

ఐపీఎల్ వేలంలో భారత యువ ఆటగాడు రిషబ్ పంత్ను లఖ్నవూ రూ.27 కోట్లతో సొంతం చేసుకుంది. ఈనేపథ్యంలోనే దిల్లీ జట్టును వీడడంపై స్పందించిన పంత్ ఎక్స్లో ఎమోషనల్ పోస్టు చేశాడు.



ఐపీఎల్ మెగా వేలంలో యువ ఆటగాడు రిషభ్ పంత్ అందరి దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడుపోయిన ఆటగాడిగా నిలిచాడు. తొమ్మిదేళ్లుగా దిల్లీ క్యాపిటల్స్ కొనసాగిన పంత్.. ఇకపై లఖ్నవూ తరపున బరిలోకి దిగనున్నాడు. ఈనేపథ్యంలోనే ఢిల్లీ జట్టును వీడడంపై స్పందించిన రిషభ్ పంత్.. 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ఎమోషనల్ పోస్టు పెట్టాడు."యుక్త వయసులో నేను దిల్లీ క్యాపిటల్స్ చేరాను. మైదానంలో ఎన్నో ఉత్కంఠభరితమైన క్షణాలు ఉన్నాయి. ఇక్కడ ఎంతో నేర్చుకున్నాను. అది నా అభివృద్ధికి సహాయపడింది. దిల్లీ జట్టుతో తొమ్మిదేళ్ల నా ప్రయాణం ఎంతో అద్భుతం. ఈ జర్నీ నాకెంతో విలువైంది. జీవితంలో క్లిష్ట సమయాల్లో అభిమానులు ఎంతో అండగా ఉన్నారు. నేను ముందుకుసాగుతున్నప్పటికీ.. మీ ప్రేమాభిమానాలు నా హృదయంలో ఎప్పటికీ ఉంటాయి. మైదానంలో మిమ్మల్ని ఉత్సాహపరిచేందుకు ప్రయత్నిస్తూనే ఉంటా. నా ప్రయాణాన్ని ప్రత్యేకంగా మార్చినందుకు మీ అందరికీ ధన్యవాదాలు" అంటూ ఎమోషనల్ పోస్టు పెట్టాడు.ఇదీ చదవండి: "ఎవరికీ భయపడం.. వైభవ్ సూర్యవంశీ వయసు ఆరోపణలపై స్పందించిన క్రికెటర్ తండ్రి పంత్ పోస్టు సోషల్ మీడియాలో వైరల్గా మారింది. కాగా.. ఐపీఎల్ వేలంలో రిషభ్ పంత్పై లఖ్నవూ కాసుల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. అతడి కోసం లఖ్నవూ, బెంగళూరు తీవ్రంగా పోటీపడ్డాయి. చివరకు లఖ్నవూ రూ.27 కోట్ల రికార్డు ధరకు అతడిని దక్కించుకుంది. దీంతో లఖ్నవూ జట్టులో చేరిన పంత్.. ఢిల్లీ క్యాపిటల్స్ను వీడాల్సి వచ్చింది. ఈక్రమంలోనే పంత్ పెట్టిన పోస్టు అభిమానుల మనసును హత్తుకుంది.

# ఏఆర్ రెహమాన్ నాకు తండ్రితో సమానం : ఆ వార్తలపై మోహినిదే వివరణ

ఏఆర్ రెహమాన్ తనకు తండ్రితో సమానమని ఆయన బృందంలోని సభ్యురాలు మోహినిదే అన్నారు. తాజాగా వస్తోన్న వార్తలపై ఆమె వివరణ ఇచ్చారు



రెహమాన్ దంపతులు విడాకులతో తనకు లింక్ చేస్తూ వస్తోన్న వార్తలపై ఆయన బృందంలోని సభ్యురాలు మోహినిదే మరోసారి స్పందించారు. రెహమాన్ తనకు తండ్రితో సమానమన్నారు. ఈసందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఆమె వివరించారు. ఇలాంటి రూమర్స్ వినడం బాధగా ఉందన్నారు.'నాది, రెహమాన్ కుమార్తెలది ఒకే వయసు. ఆయనెప్పుడూ నన్ను తన కుమార్తెలానే చూసేవారు. 8 ఏళ్లకు పైగా ఆయన బృందంలో పనిచేశాను. ఆయనంటే ఎంతో గౌరవం ఉంది. ఎన్నో సినిమాలకు ఆయనతో కలిసి మ్యూజిక్ అందించాను. మేమంతా కలిసి ఎన్నో స్టేజ్ షోలు చేశాం. మా పై ఇలాంటి వార్తలు రావడం బాధాకరం. ఇలాంటి సున్నితమైన అంశాల్లో సానుభూతి లేకుండా నిందలు వేయడం సరికాదు. ఇవి సృష్టించిన వారి మానసిక స్థితి చూస్తే బాధతో పాటు జాలివేస్తోంది. అసభ్యకరంగా మాట్లాడడం నేరంగా పరిగణించాలి'.'రెహమాన్ ఒక లెజెండ్, నా కెరీర్లో ఆయన కీలకపాత్ర పోషించారు. నా జీవితానికి రోల్మోడల్. నాకు సంగీతం నేర్పిన నా తండ్రిని నేను ఏడాది క్రితం కోల్పోయాను. అప్పటినుంచి ఈ బృందంలోని వారే సొంతవారిలా నన్ను ఆదరించారు. మీడియాకు వ్యక్తుల మనసుతో పని లేదు. మీడియాలో వచ్చే కామెంట్స్ జీవితాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతారో అర్థం చేసుకోలేరు. ఇలాంటి వార్తలు నా కెరీర్కు అంతరాయం కలిగించలేవు. దయచేసి వీటికి ఇక్కడితో ఫుల్స్టాప్ పెట్టండి. మా గోప్యతను గౌరవించండి' అని కోరుతూ ఓ వీడియో విడుదల చేశారు.ఇక మరోవైపు ఏఆర్ రెహమాన్ వ్యక్తిగత జీవితం గురించి ఎవరైనా తమకు తోచింది రాసినా, యూట్యూబ్ వేదికగా అవాస్తవాలు ప్రచారం చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన లీగల్ టీమ్ హెచ్చరించింది. ఏ సామాజిక మాధ్యమం వేదికలోనైనా అసత్య ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేయమని రెహమాన్ సూచించినట్టు తెలిపింది. తమ 29 ఏళ్ల వివాహ బంధానికి స్వస్తి పలుకుతున్నట్టు రెహమాన్, సైరా బాను దంపతులు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే.

# ఎప్పుడూ రాజీ పడొద్దు
## .. వేధింపులపై ఐశ్వర్యరాయ్ కామెంట్స్

మహిళలు ఎదుర్కొంటున్న వేధింపుల గురించి ఐశ్వర్యరాయ్ ఓ వీడియోలో మాట్లాడారు. ఏ విషయంలోనూ మహిళలు రాజీ పడొద్దని సలహా ఇచ్చారు.



వేధింపులను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై నటి ఐశ్వర్యరాయ్ మాట్లాడారు. ఓబ్యూటీ ప్రొడక్ట్ ప్రచారంలో భాగంగా ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. అందులో మహిళల గురించి మాట్లాడారు. 'మహిళలు నిత్యం వేధింపులకు గురవుతున్నారు. అలాంటివాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి. తలెత్తి ఎదుటివారి కళ్లలోకి చూడాలి. మన శరీరం మనకు విలువైనది. దాని విషయంలో ఎప్పుడూ రాజీ పడొద్దు. దాని విలువ కోసం మిమ్మల్ని మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ తక్కువ చేసుకోకండి' అని ఐశ్వర్య పేర్కొన్నారు. ఈ వీడియోపై ఆమె అభిమానులు స్పందిస్తున్నారు. 'మీరు ఎంతోమందిలో స్ఫూర్తినింపుతున్నారు', 'ఇది అందరూ తెలుసుకోవాల్సిన విషయం', 'సమాజం కోసం మీరెప్పుడూ ముందుంటారు' అంటూ కామెంట్స్ పెడుతున్నారు.ఇదీ చదవండి: వారి వల్లే ఇలా జరిగింది.. 'కంగువా' ఫలితంపై నిర్మాత కామెంట్స్ఐశ్వర్య చివరిసారి మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'పొన్నియిన్ సెల్వన్-2'లో కనిపించారు. ఈ సినిమాలో నటనకు ఆమె ఉత్తమ నటిగా సైమా అవార్డును గెలుచుకున్నారు. తన భర్త అభిషేక్తో కలిసి మణిరత్నం దర్శకత్వంలో నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ చర్చల దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో అభిషేక్- ఐశ్వర్యలు కలిసి చాలా సినిమాలు చేశారు. వాటిలో మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'గురు' ప్రత్యేకమైనది. వీరి వివాహానికి కొన్ని రోజుల ముందు ఈ సినిమా విడుదలై ఆకట్టుకుంది. ఇప్పుడు మరోసారి ఈ జంట బిగ్ స్క్రీన్పై కనిపించనుందని వార్తలు వస్తుండడంతో అభిమానులు ఆనందిస్తున్నారు.

# మోసం చేశాడని యువతి ఫిర్యాదు
## .. నటుడు శ్రీ తేజ్ పై పోలీసు కేసు

సినీ హీరో శ్రీతేజ్ పై కూకట్పల్లి పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది.



సినీ హీరో శ్రీతేజ్ పై కూకట్పల్లి పోలీసే స్టేషన్లో కేసు నమోదైంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఓ యువతి గచ్చిబౌలి పీఎస్లో ఫిర్యాదు చేసింది. దీంతో శ్రీతేజ్పై జీరో ఎఫ్ఆర్తో కూకట్పల్లిలో కేసు నమోదు చేశారు. అతడిపై బీఎన్ఎస్ 69, 115(2),318(2) సెక్షన్ కింద కేసు నమోదైంది. గతంలోనూ కూకట్పల్లిలో బాధితురాలు ఫిర్యాదు చేసింది. 'వంగవీటి', 'లక్ష్మీస్ ఎన్టీఆర్, 'పుష్ప ది రైజ్', 'మంగళవారం', 'ధమాకా' తదితర సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీతేజ్ ప్రస్తుతం అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న 'పుష్ప ది రూల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. డిసెంబరు 5న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒకవైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు వెబ్సిరీస్ ల్లోనూ శ్రీతేజ్ రాణిస్తున్నాడు. 'పరంపర', '9 అవర్స్', 'బహిష్కరణ' వంటి సిరీసుల్లో నటించి మెప్పించాడు.


## అందం

# కాలిపగుళ్లతో ఇబ్బంది పడుతున్నారా.. ఈ 6 పాటిస్తే 7 రోజుల్లో సమస్య మాయం

కాలి పగుళ్ళ సమస్య వస్తే చూడ్డానికీ ఇబ్బంది ఉండడంతో పాటు నొప్పి, రక్తం కారడం వంటి సమస్యలు ఉంటాయి. చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం వల్ల వచ్చే చర్మ సమస్యల్లో కాలి పగుల్ళు ఒకటి. ఈ సమస్యని దూరం చేయాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అందుకోసం ఎక్స్ఫోలియేషన్, మాయిశ్చరైజర్,మసాజ్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి.











### మసాజ్..



అదే విధంగా, పాదాలకి మసాజ్ చేయడం వల్ల కూడా సర్క్యులేషన్ని ఇంప్రూవ్ చేసి నొప్పిని తగ్గిస్తుంది. దీంతో పాదాల పగుళ్ళు చాలా వరకూ తగ్గుతాయి. ఆలివ్ ఆయిల్, టీట్రీ ఆయిల్స్ వంటివి రాసి మసాజ్ చేయడం వల్ల చాలా వరకూ రిజల్ట్ ఉంటుంది.

### సాక్స్..



నిద్రపోయే ముందు పాదాలకి సాక్స్ ధరించడం చాలా మంచిది. దీని వల్ల మీరు రాసిన క్రీమ్స్, లోషన్స్, ఆయిల్స్, చర్మంలోకి బాగా అబ్జార్బ్ అవుతాయి.

### పాలమీగడ, పసుపు..



అదే విధంగా, పాలమీగడలో కొద్దిగా పసుపు కలిపి రాస్తే పగిలిన పాదాలు మృదువుగా, ఆరోగ్యంగా ఉంటాయి. పసుపు యాంటీ బయాటిక్గా పనిచేస్తుంది. దీంతో పాటు అలోవెరా జెల్ రాయడం వల్ల కూడా పాదాలు మాయిశ్చర్గా ఉంటాయి. దీంతో వాపు కూడా తగ్గుతుంది.

### మాయిశ్చరైజ్..



మడమల పగుళ్లు రాకుండా ఉంటాయి. అదే విధంగా, ఆయిల్ బేస్డ్ మాయిశ్చరైజర్ లేదా పెట్రోలియమ్ జెల్లీని పాదాలకి రాయాలి. దీనికోసం గ్లిజరిన్, రోజ్వాటర్, పాలు, తేనె, అవకాడో, ఓట్ మీట్, జొజొబా ఆయిల్.. ఈ పదార్థాలన్నింటిలో ఏవేనా మీకు వీలైనవి తీసుకుని మిక్స్ చేసి క్రీమ్ పాదాలకి రాయండి. దీని వల్ల పాదాలకి తేమ అందుతుంది. నిమ్మరసం, గ్లిజరిన్ని మిక్స్ చేసి మడమల మీద రాయాలి. దీనిని రాయడం వల్ల పాదాలు హైడ్రేట్గా ఉంటాయి. విటమిన్ ఇ ఆయిల్ రాయడం వల్ల కూడా పాదాలు హైడ్రేట్గా మారడంలో హెల్ప్ చేస్తాయి.

### ఎక్స్ఫోలియేట్..



ముందుగా పాదాలను గోరువెచ్చని నీటిలో 10 నుంచి 20 నిమిషాల పాటు నాననివ్వండి. తర్వాత ప్యూమిస్ స్టోన్, ఫుట్ స్క్రబ్బర్, లూఫా.. ఇందులో ఏదైనా సరే.. తీసుకుని రబ్ చేయాలి. దీంతో డెడ్ స్కిన్ మొత్తం దూరమవుతుంది. అదే విధంగా, తేనె, చక్కెరని కలిపి స్క్రబ్లా వాడొచ్చు. దీని వల్ల పాదాలు మృదువుగా మారతాయి.

### ఎప్సమ్ సాల్ట్ బాత్..



అదే విధంగా,గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఎప్సమ్ సాల్ట్ వేసుకుని అందులో పాదాలను 5 నుంచి 10 నిమిషాలు నానబెట్టాలి.వారానికి ఓ సారైనా ఇలా చేయడం వల్ల చాలా వరకూ కాలిపగుళ్లు తగ్గుతాయి.

గమనిక:
నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

